గద్దర్ అవార్డు ప్రదానం

ప్రముఖ సంఘ సేవకులు గౌతంనగర్ డివిజన్ మల్లికార్జునగర్‌కు చెందిన శ్రీనివాస్‌కు ప్రజా గాయకుడు గద్దర్ అవార్డు లభించింది. ఈ మేరకు ఆదివారం నగరంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహనీయుల అవార్డు మహోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటుడు పృథ్వీరాజ్, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, సముద్రాల వేణుగోపాలచారి హాజరై శ్రీనివాసుకు ప్రజా గాయకుడు గద్దర్ అవార్డును అందజేశారు.

– నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 25

మెట్రో సౌకర్యం కల్పించాలి

నేరేడ్‌మెట్, ఫిబ్రవరి 25 : మేడ్చల్ మల్కాజిగిరి నియోజకవర్గ ప్రజలకు మెట్రో సౌకర్యం కల్పనకు ప్రభుత్వం కృషి చేయాలని బీజేపీ మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్ర సందర్భంగా ఆదివారం యాప్రాల్‌లో బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ చాడ సురేశ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు హరీశ్‌రెడ్డి, బీజేపీ స్టేట్ జనరల్ సెక్రటరీ వెంకటేశ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మెడల్స్ సాధించిన చిన్నారులతో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

గ్యార్వీ షరీఫ్ కార్యక్రమంలో పాల్గొన్న సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

ఆసక్తి ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలి

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

బేగంపేట్, ఫిబ్రవరి 25: చిన్నారులను ఆసక్తి ఉన్న రంగాల్లో చిన్నతనం నుంచే ప్రోత్సహించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని మాజీ మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఈ నెల 16న కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మెడల్స్ సాధించిన జెక్‌కాలనీకి చెందిన చిన్నారులతో ఆదివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని నివాసంలో కోచ్ దేవేందర్, సిరి ఎలిజబెత్ ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిశారు. గోల్డ్ మెడల్ సాధించిన మోక్షిక రిత్విక్, సిల్వర్ మెడల్ సాధించిన మోక్షిత, కార్తిక్, లియోనా, శ్రీయాన్ ఇతర మెడల్స్ సాధించిన చిన్నారులను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అభినందించారు. ఎంతో శిక్షణ ఇచ్చి మెడల్స్ సాధించే విధంగా కృషి చేసిన కోచ్‌లను కూడా ఎమ్మెల్యే అభినందించారు.

గ్యార్వీ ఉత్సవాల్లో..

రాంగోపాల్‌పేట్ డివిజన్ పరిధిలోని సిటీ లైట్ చౌరస్తా వద్ద గౌసేపాక్ దర్గాలో ఆదివారం నిర్వహించిన గ్యార్వీ షరీఫ్ పాతియా కార్యక్రమంలో మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు. ప్రార్థనల అనంతరం నిర్వాహకులు ఫకీర్, జాకీర్, అమిత్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో రాంగోపాల్‌పేట్ మాజీ కార్పొరేటర్ అరుణశ్రీనివాస్‌గౌడ్, నాయకులు ప్రేమ్‌కుమార్, వినయ్, గౌరిశంకర్, సత్యనారాయణ, శివకుమార్ పాల్గొన్నారు.

రిసాలాబజార్‌లో లాస్య చిత్రపటానికి కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న నాయకులు, కార్యకర్తలు

లాస్యనందిత చిత్రపటానికి నివాళి

బొల్లారం, ఫిబ్రవరి 25: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత చిత్రపటానికి ఆదివారం బొల్లారం ఆదర్శనగర్‌లో ఆదర్శ నగర్‌వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఈఆర్ బాల్‌రాజు మాట్లాడుతూ.. చిన్న వయస్సులో ఎమ్మెల్యేగా గెలుపొందిన లాస్య నందిత కారు ప్రమాదంలో మరణించడం ఆమె కుటుంబానికి తీరనిలోటని అన్నారు. కార్యక్రమంలో మిలిట్రీ రమేశ్, కేపీ శ్రీనివాస్, మల్లేశ్, బాబు, వెంకటేశ్, సుదర్శన్, ఎర్రోళ్ల గిరి, రవి, ఉమేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

రిసాలాబజార్‌లో..

రిసాలాబజార్‌లో డాక్టర్ అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే లాస్యనందిత మృతి పట్ల కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. దివంగత ఎమ్మెల్యే లాస్య చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఉదయ్‌కిరణ్, 8వ వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు కేజీ రవి, ఆదర్శనగర్ ఫౌండర్ మెంబర్ బాలరాజు, సుధాకర్, డాక్టర్ శంకర్ రావు, విజయ్‌కుమార్, కరుణాకర్‌రెడ్డి, హేమంత్, అశోక్, అనిల్, నాని, అరుణ్, షకీల్, నిర్సింహ, శ్రీను, దయానంద్, సోను పాల్గొన్నారు.

దివంగత ఎమ్మెల్యే లాస్యనందిత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఆదర్శనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

మోకాలి మార్పిడి చికిత్స గురించి అవగాహన కల్పించిన ఆర్థోపెడిక్ డాక్టర్ రంగనాథ్‌రెడ్డి

మోకాలి మార్పిడి చికిత్సపై అపోహలు వద్దు

అమీర్‌పేట్, ఫిబ్రవరి 25: మోకాలి మార్పిడి చికిత్స గురించి ప్రజలు అపోహలను వీడాలని అమీర్‌పేట్‌లోని ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ రంగనాథ్‌రెడ్డి అన్నారు. ఆదివారం వైద్యశాలలో ప్రజలకు అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండేండ్ల వ్యవధిలో మోకాలి మార్పిడి శస్త్ర చికిత్సలు నిర్వహించిన రోగులు, వారి కుటుంబ సభ్యులతో ఆయన అవగాహన శిబిరంలో మాట్లాడారు. మోకాలి నొప్పులతో అవస్థలు పడుతున్న వారు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు. శస్త్ర చికిత్సలకు భయపడి, అపోహలను నమ్మి ప్రజలు తమ విలువైన ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకూడదని ఆయన కోరారు. శస్త్ర చికిత్సతో ఎలాంటి ఇబ్బందులు ఉండవని, రంగనాథ్‌రెడ్డి కల్పించిన అవగాహనతో అనేక మంది బాదితులు శస్త్ర చికిత్సలకు సిద్ధం కావడం శుభ పరిణామమని నిర్వాహకులు తెలిపారు.

స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదానం

పద్మారావునగర్‌కు చెందిన స్కై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 247వ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రోడ్ల పక్కన ఉంటూ ఆకలితో అలమటించే వృద్ధులను, నిరాశ్రయులను, దివ్యాంగులను అప్యాయంగా పలకరించి వారికి భోజనం సమకూర్చామని స్కై ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ వై.సంజీవ్‌కుమార్, ఉపాధ్యక్షురాలు పావని తెలిపారు. సభ్యులు మామిడి శ్రీవిద్య, నేహా, ఖుషి, జోషి, అకాంక్ష, సంతోషి, సుధ, గౌతమ్‌కృష్ణ, నిఖిల్, వివిన్‌రెడ్డి, అఖిల్, ఇర్ఫాన్, వంశీ, జయరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

– బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 25

లష్కర్ జిల్లా సాధన కోసం పోరాటం చేస్తాం..

సికింద్రాబాద్, ఫిబ్రవరి 25: లష్కర్ జిల్లా సాధన కోసం రాజకీయ పార్టీలకు అతీతంగా పోరాటం చేస్తామని జిల్లా సాధన సమితి సభ్యులు తెలిపారు. 200 ఏండ్ల చరిత్ర కలిగిన లష్కర్.. అభివృద్ధిలో మాత్రం వెనుకబడి ఉందని అన్నారు. లష్కర్ జిల్లా సాధన లెటర్ పాడ్‌ను ఆదివారం మధురానగర్‌లోని కార్యాలయంలో ప్రారంభించారు. సమావేశంలో వారు మాట్లాడుతూ.. లష్కర్ సాధన సమితి రాజకీయాలకు అతీతంగా జిల్లా సాధనకోసమే పని చేస్తుందని చెప్పారు. కులాలు, మతాల జోలికి పోకుండా ప్రజల అభీష్టం మేరకు పోరాటం జరుపుతామన్నారు. రాజకీయ నాయకులను, పాలకులను, విద్యావంతులను, సంఘాల ప్రతినిధులను కలిసి లష్కర్ జిల్లా సాధనలో పాలు పంచుకోవాలని కోరతామన్నారు. కార్యక్రమంలో లష్కర్ సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యాదర్శి సాదం బాల్‌రాజ్‌యాదవ్, ఉపాధ్యక్షుడు శైలేందర్, బాబురావు, రవీందర్ సాగర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లెటర్ పాడ్‌ను ఆవిష్కరిస్తున్న సమితి సభ్యులు

మాదిగలకు మంత్రివర్గంలో సముచిత స్థానం కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 25: రాష్ట్ర మంత్రివర్గంలో మాదిగలకు సముచిత స్థానం కల్పించాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్ డిమాండ్ చేశారు. దండోరా రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని యూనివర్సిటీలో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా శంకర్ హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో మాదిగలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత దక్కలేదని, నూతనంగా ఏర్పడిన మంత్రివర్గంలోనైనా రాజకీయంగా మాదిగలకు సముచిత స్థానం కల్పించి, తగిన ప్రాధాన్యత ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వరంగల్, నాగర్‌కర్నూల్, పెద్దపల్లి పార్లమెంట్ స్థానాలను మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని మాదిగల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దండోరా నాయకులు చిలుక రాజ నర్సింహ, శ్యాం, రామకృష్ణ, ప్రకాశ్, శ్రీను, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొంగరి శంకర్

వివాహ పరిచయ వేదిక విజయవంతం

నగర గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన వివాహ పరిచయ వేదిక విజయవంతం అయ్యిందని సికింద్రాబాద్ గంగపుత్ర సంఘం నాయకులు పంపరి యాదగిరి, నగరపు శ్యాం అన్నారు. ఆదివారం నగర గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో అప్జల్‌గంజ్‌లో నిర్వహించిన వివాహ పరిచయ వేదికలో వధూవరులకు పెళ్లి సంబంధాలు కుదిరినట్లు చెప్పారు.

– సికింద్రాబాద్, ఫిబ్రవరి 25

ఉత్తమమైన వైద్య విధానం ఆక్యుపంక్చర్ అండ్ నేచురోపతి

ఉచిత అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 25: అనేక రోగాల బారిన పడుతున్న మానవ శరీరానికి ఉత్తమమైన వైద్యవిధానం ఆక్యుపంక్చర్ అండ్ నేచురోపతి అని ప్రముఖ వైద్యురాలు డాక్టర్ సబితావిజయ్ అన్నారు. శరీరానికి తనకు తానుగా బాగు చేసుకునే శక్తి ఉందని, ఆక్యుపంక్చర్ చికిత్స శరీరంలోని శక్తి మార్గాలను ప్రేరేపిస్తుందని చెప్పారు. తార్నాకలోని మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో డాక్టర్ సబిత ఆధ్వర్యంలో ఉచిత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. హాజరైన వారికి మందులు లేకుండా రోగాలను ఎలా తగ్గించుకోవాలో వివరించారు. చిన్న జబ్బులకే దవాఖానలకు పరిగెత్తి, వైద్యఖర్చులను పెంచుకుంటున్నారని పేర్కొన్నారు. మందులు వాడకుండా జబ్బులను తగ్గించేందుకు ఆక్యుపంక్చర్ ఉత్తమమని సూచించారు. పూర్వీకులు వంటగది ఔషధశాల అని ఎందు కు అన్నారో ఒకసారి గుర్తు చేసుకోవాలని సూచించారు. జీవితాంతం మందులపై ఆధారపడడం మానేసి, ఆక్యుపంక్చర్, నేచురోపతితో ఆరోగ్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి. వీణ, సత్యనారాయణ, వంశీ, విజయ్, నరేందర్ పాల్గొన్నారు.

విద్యార్థుల భారత్ బచావో సదస్సు

దేశంలో విద్యా పరిరక్షణ కోసం విద్యార్థులు, యువత రైతు ఉద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన భారత్ బచావో విద్యార్థుల సదస్సులో పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. సదస్సులో ప్రారంభోపన్యాసం చేసిన ప్రొఫెసర్ అనితారాంపాల్ మాట్లాడారు. సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ ప్రజల హక్కులకు బాధ్యత వహించాల్సిన ప్రభుత్వాలు హక్కులను కాలరాసే చర్యలకు పాల్పడుతున్నాయని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమక్రసీ నేతలు కె.గోవర్ధన్, ఝాన్సీ, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, భారత్ బచావో నేతలు గాదె ఇన్నయ్య, గోపీనాథ్, రమేశ్ బాబు పాల్గొన్నారు.

– ముషీరాబాద్, ఫిబ్రవరి 25

వైభవంగా గీతాజ్ఞాన యజ్ఞం వేడుకలు

సనాతన బ్రహ్మజ్ఞాన మహాసభలు గీతాజ్ఞాన యజ్ఞం 45వ వార్షికోత్సవాలను పురస్కరించుకొని మారుతీనగర్ హనుమాన్ దేవాలయం వద్ద నిర్వాహకులు సుక్క విజయలక్ష్మి, మల్లేశ్ దంపతుల ఆధ్వర్యంలో మహాయజ్ఞాన్ని నిర్వహించారు. మూడురోజుల పాటు జరిగే ఈ మహాయజ్ఞంలో వందలాది మంది భక్తులు పాల్గొని మహాయజ్ఞాన్ని నిర్వహించారు. పూజల అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సుక్క భవాని, మల్లేశ్ దంపతులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

– అడ్డగుట్ట, ఫిబ్రవరి 25

దళితులకు రిజర్వేషన్లు పెంచాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 25: దళితులకు రిజర్వేషన్లను 18 శాతానికి పెంచాలని తెలంగాణ దళిత రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర వ్యస్థాపక అధ్యక్షుడు గంధం సుమన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బండి అజయ్‌మాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి.శ్రీకాంత్ మాదిగ, డబ్బా రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు చట్టాలను వ్యతిరేకించాలి

రవీంద్రభారతి, ఫిబ్రవరి 25: ఇచ్చిన హామీలను నెరవేర్చాలని రైతులు డిమాండ్ చేస్తూ ఉద్యమాలు చేస్తుంటే నరంద్రమోదీ ప్రభుత్వం కాల్చిచంపుతుందని కార్మికులు, రైతులు ఖండించాలని ఇంక్లాబ్ సేన ప్రతినిధులు చెప్పారు. ఆదివారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఇంక్లాబ్ సేనా రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ జానీ ఉమర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఎం హుస్సేన్ మాట్లాడారు.

అక్రమ పదోన్నతులపై ప్రభుత్వం దృష్టి సారించాలి

■ ఏఐఎస్ఎఫ్ డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 25: రాష్ట్రంలోని వర్సిటీల్లో అధ్యాపకుల పదోన్నతుల అక్రమాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఓయూ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ ఓయూ కార్యదర్శి నెల్లి సత్య మాట్లాడుతూ అక్రమాలపై హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అవకతవకలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. వారిని త్వరలో నియమించే వైస్ చాన్స్‌లర్ నియామకాల్లో పరిగణించకూడదని విజ్ఞప్తి చేశారు. ఓయూ రిజిస్ట్రార్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పదోన్నతుల అక్రమాలను సమర్థించుకునేందుకు అసత్యాలను ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని ఉస్మానియా, కాకతీయ, అంబేద్కర్, జేఎన్టీయూ యూనివర్సిటీల్లో కొంతమంది ప్రొఫెసర్లు అర్హత లేకున్నా అవకతవకలకు పాల్పడి అక్రమంగా సీనియర్ ప్రొఫెసర్లు అయ్యారని ఆరోపించారు. ప్రస్తుతం యూనివర్సిటీల ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. నూతన వీసీలను నియమించేందుకు ఏర్పాటు చేసిన సెర్చ్ కమిటీలకు నామినీలను ప్రతిపాదించి, తిరిగి పదవులు పొందే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. దీనిని ప్రభుత్వం గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు భగత్, రాధాకృష్ణ, అశ్వన్, హర్ష చరణ్ పాల్గొన్నారు.

ప్లకార్డులను ప్రదర్శిస్తూ నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ప్రజా రాజ్యాధికార ఉత్సవ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య

ఎస్‌టీఎస్ఏ క్యాలెండర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 25: సామాజిక తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎస్‌టీఎస్ఏ) ఆధ్వర్యంలో 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఏడాది పాటు ప్రజా రాజ్యాధికార ఉత్సవం పేరుతో రూపొందించిన క్యాలెండర్‌ను బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌టీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు తాళ్ల అజయ్ మాట్లాడుతూ 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఈ ఏడాదిని ప్రజలందరూ వేడుకగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగం ద్వారా స్వేచ్ఛ, సమానత్వ హక్కులు, అభివృద్ధిని పొందుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీలు సోదరభావంతో అసమానతలను దూరం చేసుకోవాలని కోరారు. సామాజిక సమీకరణాలతో చివరి వ్యక్తికి న్యాయం అందేలా ప్రజాస్వామ్య నిర్మాణానికి కట్టుబడి ముందుకు కదలాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు మనోజ్, ప్రసాద్, హరికృష్ణ, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ ఉద్యమకారులకు టికెట్లు కేటాయించాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 25: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో పర్యావరణ ఉద్యమకారులకు టికెట్లు కేటాయించాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు సీహెచ్ రంగయ్య వివిధ రాజకీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ అంటే సామాజిక సుస్థిరత అని, తాము పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉన్నామనే పార్టీలు ఈ ఎన్నికల్లో ఆయా రాష్ట్రాల్లో కనీసం ఒక సీటు అయినా పర్యావరణ ఉద్యమకారులకు కేటాయించాలని అన్నారు.

మన్ కీ బాత్‌లో డీపీఎస్ విద్యార్థులు

ఉప్పల్, ఫిబ్రవరి 25: నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఆదివారం మన్ కీ బాత్ కార్యక్రమాన్ని ప్రసారం చేశారు. ఈ సందర్భంగా పల్లవి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ చైర్మన్ మల్క కొమురయ్య, సీనియర్ ప్రిన్సిపాల్ సునీతారావు, విద్యార్థులతో కలిసి కార్యక్రమాన్ని వీక్షించారు.

సుదర్శన హోమం

రాంనగర్ ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య ఫామిలీ వెల్ఫేర్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో ఆదివారం జెమిని కాలనీ శివాలయంలో సుదర్శన హోమం, మహా మత్యుంజయ హోమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత పూస రాజు, సంఘం ప్రతినిధులు వి. సుధాకర్‌గుప్త, ఎర్రం శ్రీనివాస్, నేతి సత్యనారాయణ, రాజశేఖర్‌గుప్త, చల్ల శివకుమార్, సత్యవర్ధన్, పులిగిల్ల కృష్ణమూర్తి, గంప మల్లేశ్, రమేశ్‌రామ్, రామనాథం, రఘురాములు, చంద్రశేఖర్, చామల శ్రీనివాస్, ఎర్రం రమేశ్, నాగేందర్, ప్రకాశ్ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

– ముషీరాబాద్, ఫిబ్రవరి 25

మెగా మెడికల్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కవాడిగూడ, ఫిబ్రవరి 25: ఉచిత వైద్య శిబిరాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కవాడిగూడ డివిజన్ కార్పొరేటర్ గోడ్చల రచనశ్రీ అన్నారు. ఈ మేరకు ఆదివారం కవాడిగూడ డివిజన్ దోమలగూడలోని కిడ్ హుడ్ ప్రీస్కూల్‌లో బద్రివిశాల్ పన్నాలాల్ పిత్తి ట్రస్ట్ అగర్వాల్ సమాజ్ తెలంగాణ శాఖ, అగర్వాల్ సమాజ్ హెల్త్ క్లినిక్ ఆధ్వర్యంలో శ్రీ భగవాన్ మహావీర్ విక్లాంగ్ సహాయత నమితి, హైదరాబాద్, మెడికవర్ దవాఖాన బేగంపేట, ఎల్‌సీఎస్ దండు ఐ ఇన్‌స్టిట్యూట్ వెస్ట్ మారెడ్‌పల్లి సహకారంతో ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంప్‌ను ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ఈ క్యాంప్‌లో కంటి పరీక్షలు, జనరల్ ఫిజీషియన్, డెంటల్, ఫిజియోథెరపీ తదితర పరీక్షలను నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రదీప్ అగర్వాల్, సుధీర్‌గుప్తా, సురేందర్‌గోయల్, విజయ్ కుంచల, రష్మి అగర్వాల్, బీజేపీ రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు

మల్కాజిగిరి, ఫిబ్రవరి 25: వేసవిలో విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటామని డీఈ సుచేందర్‌నాథ్ అన్నారు. ఆదివారం సికింద్రాబాద్ పరిధిలోని ఫ్యూజ్ కాల్ ఆఫీస్, సీబీడీ, ఆపరేషన్స్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ సుచేందర్‌నాథ్ మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో కొరతలేదని, అధికారులకు తెలవకుండా విద్యుత్ సరఫరాను నిలిపివేయవద్దని, అత్యవసర పరిస్థితులో విద్యుత్ సరఫరాను నిలిపివేయాల్సి వచ్చినప్పుడు ఉన్నతాధికారులకుముందస్తుగా సమాచారం ఇవ్వాలన్నారు. వినియోగదారుల నుంచి వచ్చిన ప్రతి ఫోన్ కాల్‌కు సిబ్బంది జవాబుదారిగా ఉండాలన్నారు. వినియోగదారులకు విద్యుత్ సమస్యలు ఉంటే సబ్ స్టేషన్ సిబ్బందికి ఫోన్ ద్వారా తెలపాలని కోరారు.